క్లుప్తంగా

నేడు పశ్య కన్నమ్మ సంతాప సభ

హుజూర్‌నగర్ : తెలంగాణ సాయుధ పోరాట వీరనారి పశ్య కన్నమ్మ సంతాప సభను సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో పాటు సీపీఐ, ఇతర పార్టీల నాయకులు పాల్గొంటారని వారు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని గోవింద పురంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక హుజూర్‌నగర్, కోదాడ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించారు. ప్రతిఒక్కరూ జ్ఞాన మార్గం అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి.వెంకటేశ్వర్లు, నరసింహారావు, శైలజ, మహేష్, శ్రీనివాస్, విజయ తదితరులు పాల్గొన్నారు.

రజక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



హుస్సేన్‌ను సన్మానిస్తున్న రజక ఉద్యోగులు

నేరేడుచర్ల : ప్రభుత్వ రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పగిళ్ల హుస్సేన్‌ను ఆదివారం నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో నల్లగొండ ఎక్సైజ్ ఎస్‌ఐ ఖమ్మంపాటి విజయ్‌కుమార్, నిమ్మల సైదులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రజక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డు సభ్యులు ఖమ్మంపాటి శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు.

పశుగ్రాసం అందజేత

గరిడేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో కొలువై ఉన్న తిరుపతమ్మగోపయ్య దేవస్థానం గోవులకు గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన రైతు అనంతు వెంకన్న 50 వరిగడ్డి కట్టలు (పశుగ్రాసాన్ని) ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అభినందించారు.

పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించేలా చట్టం చేయాలి

మునగాల : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించే విధంగా ప్రభుత్వం చట్టం తీసుకురావాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. ఆదివారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామీణ పాఠశాలలో 20 మంది విద్యార్థులు మాత్రమే విద్యాభ్యాసం చేస్తున్నారని అన్నారు. చాలమంది పిల్లల తల్లిదండ్రులు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కట్టలేక ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల మీద ప్రభుత్వ ఉద్యోగులకు నమ్మకం ఉండాలని అప్పుడే ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతం అవుతాయని రామకృష్ణయాదవ్ తెలిపారు.

జ్వాలా నరసింహస్వామి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

చిలుకూరు: మండల కేంద్రం పరిధిలోని జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిలుకూరు రామాలయం కమిటీ చైర్మన్ పాందూరి రమేష్, నర్మద దంపతులు పీటల మీద కూర్చొని కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సిరికొండ పృథ్వీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, దొంతగాని వీరస్వామి, కొండా నరేష్, పాందూరి సైదయ్య, కొడారు రాము, మాదరపు గోవిందు, నర్సయ్య, సుదర్శన్, రమేష్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దంతెల వాగు ఆక్రమణ !

మునగాల : మండలంలోని తాడువాయి శివారులో గల దంతెల వాగు ఆక్రమణకు గురవుతోంది. గత కొంతకాలంగా కొందరు వాగులో మట్టిపోసి చదును చేసి ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన దంతెల వాగు గుండా వర్షాకాలంలో నీటి వరద ప్రవహించి మండలంలోని గణపవరం చెరువుకు చేరుకుటుంది. సుమారు 100 ఎకరాల్లో ఈ వాగు విస్తరించి ఉందని, కానీ ప్రస్తుతం కబ్జాలతో వాగు కాలక్రమేణా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు అంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి వాగును పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.



వాగులో మట్టిపోసి చదును చేసిన ఆక్రమణదారులు

పగలెందుకీ వెలుగులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్ల వీధి దీపాలు రేయింబవళ్లు వెలుగుతున్నాయి. నాల్గవ వార్డు, టీచర్స్, ఇంకా పలు కాలనీల్లో వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా పట్టణంలో కొన్నిచోట్ల టైమర్లు చెడిపోయి లైట్లు పగలు వెలుగుతున్నాయని , వెంటనే మరమ్మతులు చేపట్టి సరిచేయిస్తామని తెలిపారు.



హుజూర్‌నగర్‌లో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు లేనిపోని నిబంధనలు పెట్టి లబ్ధిదారులను ఆందోళనకు గురి చేస్తోందని ఆరోపించారు. 400 నుంచి 600 చదరపు అడుగులలోపే ఇంటి నిర్మాణం చేపట్టాలని అనడం సరైంది కాదన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదర వెంకన్న, యువజన నాయకులు వెంకట్ తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సోమయ్య అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ మొదటి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకున్న లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు విశ్వ ప్రయత్నం చేస్తోందని అన్నారు. దీంతో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, నిర్మాణ రంగ కార్మికులు పెద్దఎత్తున ఈ సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగుల్ మీరా, ప్రధాన కార్యదర్శిగా డి.మల్లేష్, కోశాధికారిగా ఎ.నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా వై.శ్రీను, సహాయ కార్యదర్శిగా జి.సతీష్, సభ్యులుగా నరేష్, రవి, నాగేశ్వరరావు, శ్రీను, మున్నీర్, నాగరాజు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.ఉపేందర్, రాజేష్, శేషు, నారాయణ, సీతారాములు, నబి, షబ్బీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

- బడిలో పాఠాలు బోధించడంతో పాటు గుడిలో అర్చకుడిగా పూజలు
- కవి, రచయిత, కళాకారుడిగానూ రాణిస్తున్న సూర్యానారాయణమూర్తి
- తండ్రి అడుగుజాడల్లో తనయుడు



మఠంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు పండిట్‌గా..

మఠంపల్లి : ఒకవైపు తెలుగు పండితుడిగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే మరోవైపు వారసత్వంగా వచ్చిన అర్చకత్వాన్ని కొనసాగిస్తున్నాడు మఠంపల్లికి చెందిన సోమయాజుల సూర్యనారాయణమూర్తి శాస్త్రి. కవిగా, రచయితగా, కళాకారుడిగానూ రాణిస్తున్నాడు ఆయన.

మండల కేంద్రానికి చెందిన దివంగత తెలుగు పండిట్ బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి పెద్ద కుమారుడైన సూర్యనారాయణమూర్తిశాస్త్రి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సీనియర్ తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే దుర్గానగర్‌లో గల శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో పూజారిగా చేస్తున్నాడు. అయితే లక్ష్మీనరసింహశాస్త్రి కవి, రచయిత, కళాకారుడు. భద్రచలంలో రాములవారి కల్యాణంలో వ్యాఖ్యాతగా వ్యవహరించారు. దీంతో సూర్యనారాయణమూర్తి కూడా తండ్రికి తగ్గ వారసుడిగా కవి, రచయిత, కళాకారుడిగా రాణిస్తున్నాడు. పలు నాటకాల్లో నటిస్తూ గుర్తింపు పొందుతున్నాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నాడు.



మఠంపల్లిలోని కనకదుర్గ దేవాలయంలో పూజలు చేస్తున్న సూర్యనారాయణమూర్తిశాస్త్రి

భార్య తోడ్పాటుతో..

దుర్గానగర్‌లోని కనకదుర్గ ఆలయం ఆవరణలోనే సోమయాజుల సూర్యనారాయణమూర్తిశాస్త్రి తన భార్య శైలజ, కుమారుడు, కుమార్తెతో నివాసం ఉంటున్నాడు. నిత్యం తెల్లవారుజాముననే అమ్మవారికి నిత్యకైంకర్య పూజలు, సాయంత్రం పూజలు చేస్తున్నారు. అర్చకత్వంలో భార్యశైలజ కూడా తోడ్పాటు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత 10 ఏళ్ల క్రితం కొద్దిపాటి ఇళ్లు కలిగిన ఆలయం ఉన్న ప్రాంతం సోమయాజుల కుటుంబం చేస్తున్న అమ్మవారి సేవలతో దుర్గానగర్ కాలనీగా అవతరించిందని స్థానికలు చెబుతున్నారు.

వారసత్వంగా అర్చకత్వం..

మఠంపల్లికి చెందిన దివంగత మన్నెం ఆదెమ్మ అనే భక్తురాలు సుమారు 45 ఏళ్ల క్రితం మట్టపల్లి–హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై శ్రీకనకదుర్గాదేవికి ఆలయం నిర్మించింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని దుర్గానగర్‌గా పిలుస్తున్నారు. ఈ ప్రాంతంలోని పెద్దలు కమిటీగా ఏర్పడి నిత్యం అమ్మవారికి ఉత్సవాలు జరుపుతుంటారు. అయితే ఈ ఆలయాన్ని నిర్మించిన ఆదెమ్మ హిమాలయాల్లో సైతం ధ్యానం పొంది వచ్చారు. ఆదెమ్మ కోరిక మేరకు ఆనాటి తెలుగు పండిట్ బ్రహ్మశ్రీ లక్ష్మీనరసింహశాస్త్రిని అర్చకత్వ బాధ్యతలు చేపట్టాల్సిందిగా కోరడంతో అప్పటికే వీవీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా ఉన్న శాస్త్రి 1996లో అర్చకత్వ బాధ్యతలు తీసుకున్నారు. కాలక్రమేణా తన తండ్రి మరణం అనంతరం నుంచి సోమయాజుల సూర్యనారాయణమూర్తిశాస్త్రి అర్చకత్వాన్ని కొనసాగిస్తున్నాడు. నేటికీ 23 ఏళ్లుగా నిరాటంకంగా అర్చకత్వం చేస్తున్నాడు.

సోమయాజుల కుటుంబం సేవలతో ఆలయానికి గుర్తింపు

దుర్గానగర్‌లోని శ్రీకనకదుర్గ ఆలయానికి సూర్యనారాయణమూర్తిశాస్త్రి కుటుంబం చేస్తున్న సేవలతో ఆలయానికి మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు పండిట్‌గానే కాకుండా పలు రంగాల్లో మూర్తి రాణిస్తున్నారు.

– మన్నెం సీతారామిరెడ్డి, పీఈటీ, మఠంపల్లి

దైవార్చన నా అదృష్టం

విద్యార్థులకు పాఠాలు బోధించే నా జిహ్వకు శ్రీకనకదుర్గ అమ్మవారికి నిత్యం అర్చనలు చేసే అవకాశం రావడం నా పూర్వ జన్మ సుకృతం. నా తల్లిదండ్రులు నాకు ఇచ్చిన జన్మ ఫలం. మఠంపల్లిలోని దుర్గాలయం మంచి క్షేత్రంగా గుర్తింపు పొందాలనేది నా తపన, అందుకోసం భగవంతుడు నాకు ఇచ్చిన శక్తి మేరకు కృషి చేస్తా.

– సూర్యనారాయణమూర్తి శాస్త్రి, మఠంపల్లి

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోదాడరూరల్ : మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం కోదాడ మండలంలోని రామాపురం క్రాస్ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 25 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2004– 05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు చిట్టి రాంరెడ్డి, రాంరెడ్డి, ప్రతాపరెడ్డి, పద్మ, మీరాజుద్దీన్, విద్యార్థులు పాషా, వేపూరి సుధీర్, దున్నా ప్రదీప్, శివ, మేకల గంగరాజు, చారాల ధనాచారి, యాకూబ్, జ్యోతి, పార్వతి పాల్గొన్నారు.

పాలకవీడులో..

పాలకవీడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001– 02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాడు తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోదాడరూరల్ : ఆత్మీయ సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మోతెలో..

మోతె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేపలసింగారంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గల ఆర్‌సీఎం పాఠశాలలో 2005– 2006 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మోతెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..



పాలకవీడులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో..



నడిగూడెంలోని బాలుర ఉన్నత పాఠశాలలో..

ఉగ్రవాదంపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలి

- సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్ : ఉగ్రవాద నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని అమర వీరుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యుద్ధం ఆగినందున సోమవారం జరిగే భారత్, పాక్ చర్చల్లో ఉగ్రవాద నిర్మూలన దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉగ్రవాదులకు నిలయంగా మారిన పాకిస్తాన్‌పై అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి తెచ్చేలా కేంద్ర పాలకులు ముందుకెళ్లాలని సూచించారు. దేశంలో పెరుగుతున్న ధరలను నియంత్రించకుండా, నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేయకుండా, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20న వివిధ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకట్‌రెడ్డి, నాయకులు దుగ్గి బ్రహ్మం, భూక్య పాండు, వట్టెపు సైదులు, శీలం శ్రీను, బాలు నాయక్, వెంకట్‌రెడ్డి, మురళి, సైదులు, సోమయ్య, మల్లయ్య, శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

ఇటుక బట్టీని ఢీకొట్టిన కారు

- ఇద్దరికి గాయాలు

హుజూర్‌నగర్‌రూరల్: కారు అదుపుతప్పి ఇటుక బట్టీని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలంలో ఆదివారం జరిగింది. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన పల్లేటి సుందర్ కుటుంబ సభ్యులతో కలిసి మిర్యాలగూడలో బంధువుల వివాహానికి కారులో వెళ్తున్నాడు. హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామ శివారులోకి రాగానే బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కారు ముందుకు వచ్చి సడన్‌గా డాష్ ఇవ్వడంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన సుందర్ కారును పక్కకు తిప్పాడు. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇటుక బట్టీని బలంగా ఢీకొట్టింది. కారులోని బెలూన్లు తెరుచుకున్నప్పటికీ సుందర్ తల్లి రాములమ్మకు వెన్నుముక, కాలుకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. రాములమ్మను సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైనట్లు బాధితుడు తెలిపారు.

వీర జవాన్‌కు నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన యువకులు

మునగాల : ఇటీవల పాకిస్తాన్ – ఇండియా మధ్య జరిగిన యుద్ధంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ మృతి చెందడం పట్ల ఆదివారం మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గిరిజన యువకులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన యువకులు బాణోతు సురేష్‌బాబు, పవన్‌నాయక్, మాలు నాయక్, గోపి నాయక్, చరణ్‌నాయక్, గుణశేఖర్ నాయక్, దేవేందర్‌నాయక్, లిఖిత్‌నాయక్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్, ఆయిల్ చోరీ

మునగాల : మండల కేంద్రం శివారులో సాగర్ ఎడమ కాలువపై గల ఎల్– 33 నవ భారత్ ఎత్తిపోతల పథకంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్ చోరీకి గురైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఎత్తిపోతల పథకం వద్ద ఏర్పాటు చేసిన 550 కేవీ, 400 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైర్, ఆయిల్ శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. చోరీ జరిగిందని శనివారం రాత్రి గుర్తించిన లిఫ్ట్ సిబ్బంది ఆదివారం ఉదయం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వేలిముద్రల నిపుణులతో పరీక్షలు నిర్వహించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్యశిబిరం ఏర్పాటు



మందులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేళ్లచెరువు : మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఖమ్మంకు చెందిన సహస్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రభారి జిల్లా జనార్దన్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు గుండెబోయిన వీరబాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : మండల కేంద్రంలోని బాబూ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బిగ్ టీవీ ఆధ్వర్యంలో మలక్‌పేట యశోద హాస్పిటల్ వైద్య బృందంచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, గుండె, ఊపిరితిత్తులు, గర్భకోశ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తండు హరికృష్ణగౌడ్, నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, గాదె లూర్థుమ్రెడ్డి, బోనగిరి ప్రకాష్‌బాబు, జోసుబాబు, మల్లెబోయిన గోపయ్య, కుభం లింగయ్య, ఏసుమల్ల రాములు, శౌరి, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి సన్మానం



సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మునగాల : టాస్కా జిల్లా అధ్యక్షుడు, మాధవరం గ్రామానికి చెందిన ఆరె.రామకృష్ణారెడ్డిని ఆదివారం జిల్లా కేంద్రంలోని టాస్కా కార్యాలయంలో సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. టాస్కా జిల్లా ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల విద్యాసాగర్, గుంటకండ్ల ముకుందరెడ్డి, అన్నపూర్ణమ్మ, పిచ్చమ్మ, విజయమ్మ, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పెయింటర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : పెయింటర్స్ యూనియన్ మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దూరె వినోద్, ఉపాధ్యక్షుడిగా మచ్చ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా చింతమల్ల జయరాజ్, కోశాధికారిగా లతీఫ్‌పాషా, కమిటీ సభ్యులుగా లింగయ్య, వెంకటేష్, విజయ్, ప్రదీప్, రవి, మట్టయ్య, సతీష్, జానీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ఎస్‌కె.రఫీ, తిరపయ్య, పిట్ట వెంకటేష్, నందిపాటి అరవింద్, బిల్లా రాము, రామాంజీ, శ్రీను, వెంకన్న, వీరస్వామి, మట్టయ్య, మురళి, వినోద్, వంశీ, మహేష్, చింటు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు

అన్నదానం

కోదారూరల్ : కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ ఆవరణలో సెవెన్ వండర్స్ మిత్రమండలి సహకారంతో కోటేశ్వరరావు జ్ఞాపకార్థం స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తమ మిత్రుడి జ్ఞాపకార్థం పేదల ఆకలి తీర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు మిత్రమండలి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పందిరి సత్యనారాయణ, యాధా సుధాకర్, వెంపటి వెంకటరమణ, పత్తి నరేందర్, సాయి, కొత్తూరి శ్రీనివాసరావు, రామ్మూర్తి, రామారావు తదితరులు ఉన్నారు.